

జాతీయ లోక్ అదాలత్ వాయిదా

రాజాం రూరల్, ఫిబ్రవరి 28: రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ (అమరావతి) ఆదేశాల మేరకు వచ్చే నెల 9న జరగాల్సిన జాతీయ లోక్అదాలత్ 16వ తేదీకి వాయిదా పడిందని సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని కక్షిదారులు, న్యాయవాదులు గమనించాలని కోరారు. మార్చి 16న నిర్వహించనున్న లోక్అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు ఇరుపార్టీల పరస్పర అంగీకారంతో రాజీ అయ్యేలా పోలీసు, రెవెన్యూ అధికారులు, న్యాయవాదులు, బ్యాంకర్లు సహకరించాలని కోరారు.

ఎన్నికల్లో వైసీపీని ఓడించండి

- జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే నాశనమే
- పోరాటానికి అన్ని పార్టీలు కలిసి రావాలి
- కలెక్టరేట్ వద్ద సర్పంచ్‌ల నిరసన ధర్నా


డీఆర్వో అనితకు వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ చాంబర్ నాయకులు

కలెక్టరేట్, ఫిబ్రవరి 28: రాష్ట్రంలో మరోసారి జగన్ అధికారంలోకి వస్తే పల్లెలు నాశనమై, గ్రామీణ ప్రజలు తీవ్ర కష్టాలు పడతారని రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. పంచాయతీ చాంబర్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద సర్పంచులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు. దీనికోసం రాష్ట్రంలోని అన్ని పార్టీలు కలిసి రావాలన్నారు. సీఎం జగన్ తమ నిధులు, అధికారాలు, విధులను దొంగించారని ఆరోపించారు. నిధులు, విధుల కోసం గత మూడేళ్లుగా అనేక ఉద్యమాలు, ఆందోళనలు చేస్తున్నా సీఎం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో 12,918 గ్రామాల్లోని 3.50కోట్ల మంది ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయారని విమర్శించారు. సర్పంచ్‌ల సంఘం నాయకుడు వానపల్లి లక్ష్మీ ముత్యాలరావు మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో జగన్‌కు వ్యతిరేకంగా ఓటు వేయించాలన్నారు. 'జగన్ ఓడితేనే -మన మనుగడ' అనే నినాదంతో అన్ని పార్టీలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు పని చేయాలన్నారు. అనంతరం డీఆర్వో అనితకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరు ప్రతాపరెడ్డి, కార్యదర్శి గేదుల రాజారావు, జిల్లా సర్పంచులు సోము నాయుడు, ఉమ్మడి చిత్తూరు జిల్లాపంచాయతీ రాజ్ చాంబర్ అధ్యక్షుడు చుక్క ధనుంజయ్ యాదవ్, పంచాయతీ రాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద రాజు, చింతకాయలు ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రాష్ట్ర పంచాయతీ రాజ్, సర్పంచ్‌ల సంఘం నాయకులు

డిప్యూటీ సీఎంకు నిరసన సెగ

- రాజన్నదొరకు వ్యతిరేకంగా గిరిజనుల నినాదాలు
- సాగుభూమి, ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్
- వినతిపత్రం స్వీకరించని ఉప ముఖ్యమంత్రి
- మండిపడిన గిరిజన సంఘ నాయకులు


రాజన్నదొరను నిలదీస్తున్న గిరిజనులు

మెంటాడ ఫిబ్రవరి 28: వలంటీర్లకు వందనం కార్యక్ర మంలో పాల్గొన్న ఉపముఖ్య మంత్రి రాజన్నదొరకు గిరిజను ల నుంచి నిరసన సెగ తగిలింది. ఆయన ఎదుటే గిరిజనులు రాజన్నదొర డౌన్ డౌన్ అంటూ నినదించారు. 'గిరిజనుల ఓట్లతో గెలిచిన మీకు.. మేమంటే అంత చిన్న చూపా' అంటూ వారు అనడంతో డిప్యూటీ సీఎం ఆగ్రహించారు. వెంటనే రాజన్నదొర కారు ఎక్కి అక్కడి నుంచి వెళ్లిపో యారు. వివరాల్లోకి వెళ్తే.. మెం టాడ ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో బుధవారం వలంటీ ర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సభకు డిప్యూటీ సీఎం రాజన్నదొర వచ్చేసరికి.. 245 మంది వలం టీర్లకు గాను నాయకులతో కలిపి 200 మంది వరకు హాజరయ్యారు. ఈ లోగా అక్కడ వేసిన కుర్చీలను వైసీపీ నేతలు నింపేశారు. భోజనాల అనంతరం ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. అయితే కార్యకర్తలు, నాయకులు తాకిడి ఎక్కువ అవడంతో రద్దీగా మారింది. ఈ క్రమంలో రాజన్నదొర కొందరికి పట్టాలు ఇచ్చి వెనుదిరిగారు. కార్యాలయం నుంచి బయటకు వస్తున్న ఉప ముఖ్యమంత్రికి సీపీఎం నేత రాకోటి రాములుతో కలిసి గిరిజనులు ఇల్లు, పోడు పట్టాలు అందం లేదని విన్నవించారు. గుర్లగెడ్డ మినీ రిజర్వాయరు పూర్తిచేస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చారని సీపీఎం నేత అనడంతో... 'ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు మీ దగ్గర ఆధారాలు ఉన్నాయా? ఉంటే చూపించండి' అని రాజన్నదొర అన్నారు. 'పోడు భూములు, ఇంటి పట్టాలు ఇస్తామని మీరు అన్నారు కదా...ఎంతమందికి ఇచ్చారు? మీరిచ్చిన హామీలైనా నెరవేర్చండి' అని సీపీఎం నేతతో పాటు గిరిజనులు అనడంతో రాజన్నదొర ఆగ్రహం చెందారు. అదే సమయంలో సీపీఎం నాయకులతో పాటు గిరిజనులను పోలీసులు వెనక్కి నెట్టారు. డిప్యూటీ సీఎం తన కారు ఎక్కేందుకు వెళ్తుండగా.. గిరిజనులు ప్రభుత్వానికి, రాజన్నదొరకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం విలేఖర్లతో సీపీఎం నేత రాములు మాట్లాడుతూ...గిరిజనుల ఓట్లతో గెలిచిన ఉపముఖ్యమంత్రి గిరిపుత్రులను అవమానించడం సరికాదన్నారు. రానున్న ఎన్నికల్లో గిరిజనుల సత్తా చూపిస్తామని తెలిపారు. గిరిజనుల సమస్యలు పరిష్కరించకపోతే వచ్చే నెల నాలుగు నుంచి ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. ఐద్వా నాయకులు హరికృష్ణ వేణి మాట్లాడుతూ.. మహిళలను ఉపముఖ్యమంత్రి రాజన్నదొర అవమాన పరిచారని, గిరిజనుల సమస్యలు వినకుండా పోలీసులతో నెట్టివేయడం బాధాకరమని అన్నారు.


ఆందోళన చేస్తున్న గిరిజనులు



- అవి అన్నయ్య మనుషులవి!
- చూసీచూడనట్లు ఉండండి
- టౌన్ ప్లానింగ్ అధికారులకు హుకుం
- కొత్తపేట-అంబటి సత్రం రహదారి విస్తరణ పనుల్లో నిబంధనలు ఉల్లంఘన
- సామాన్యుల ఇళ్లను కూలగొట్టి..
- రాజకీయ పలుకుబడి ఉన్నవారివి వదిలేస్తున్న వైనం

ఆ భవనాల జోలికెళ్లొద్దు

ఈ చివరి నుంచి ఆ చివరి వరకూ అంతా అన్నయ్య (ఎమ్మెల్యే) మనుషుల భవనాలే. ఆ భవనాల జోలికెళ్లొద్దు. చూసీచూడనట్టుగా వదిలేయండి. మిగతా వారి భవనాలు మీ ఇష్టం. ఇవీ అధికార పార్టీ నేతల నుంచి టౌన్ ప్లానింగ్ అధికారులకు వచ్చిన ఆదేశాలు. దీంతో చేసేదీ లేక అధికారులు కొత్తపేట-అంబటి సత్రం రహదారి విస్తర్ణ పనుల్లో నిబంధనలు గాలికొదిలేశారు. రోడ్డు విస్తర్ణకు అడ్డుగా ఉన్న సామాన్యుల ఇళ్లను కూలగొడుతున్న అధికారులు రాజకీయ పలుకుబడి ఉన్న వారి భవనాల వైపు కన్నెత్తిచూడడం లేదు. ఒక చోట 66 అడుగులు, మరో చోట 60, ఇంకొకచోట 50 నుంచి 55 అడుగులు.. ఇలా ఇష్టానుసారంగా రోడ్డు విస్తరణ చేపడుతుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

(విజయనగరం రింగురోడ్డు)

నగరంలోని కొత్తపేట నుంచి అంబటి సత్రం వరకు చేపడుతున్న రోడ్డు విస్తర్ణ పనుల్లో రాజకీయ జోక్యం ఎక్కువైంది. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో అధికారులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. 66 అడుగుల మేర రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న సామాన్యుల ఇళ్లను కూలగొడుతున్న అధికారులు రాజకీయ పలుకుబడి ఉన్న వారి ఇళ్ల వద్ద మాత్రం ఈ నిబంధనను తుంగలోకి తొక్కుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఈ రోడ్డుకి ప్రతిపాదనలు చేశారు. నిధులు కూడా సిద్ధమయ్యాయి. న్యాయస్థానాల్లో కేసులు ఉండడం వల్ల అప్పట్లో రోడ్డు విస్తర్ణ సుదీర్ఘంగా పెండింగ్‌లో ఉండిపోయింది. ఇప్పుడు ఎన్నికల సమయం కావడంతో కొన్ని ఓట్లయినా కలిసొస్తాయని ఎమ్మెల్యే కోలగట్ల ఆగమేఘాల మీద ఈ రోడ్డు విస్తర్ణ పనులు ప్రారంభించేశారు. అయితే, కచ్చితంగా 66 అడుగుల మేర విస్తీర్ణ చేపట్టాల్సి ఉంది. కానీ, ఒక చోట 66 అడుగులు, మరో చోట 60, ఇంకొకచోట 50 నుంచి 55 అడుగులు.. ఇలా ఇష్టానుసారంగా రోడ్డు విస్తరణ చేపడుతున్నారు. 66 అడుగుల విస్తరణకు సంబంధించి గతంలో 163 మంది యాజమానులకు టీడీఆర్ బాండ్లను, నిర్మాణ పరిహారం కూడా అందజేశారు. టీడీఆర్, నష్ట పరిహారం తీసుకున్నా కొందరు ఎంచక్కా యధాస్థితిలోనే వారి నిర్మాణాలు చేపట్టేశారు. తొలుత కాలువకు మార్కింగ్ వేశారు. ఆ తరువాత కాలువల అలైన్‌మెంట్ కూడా మారిపోయింది. ముఖ్యంగా అంబటి సత్రం దగ్గర నాలుగైదు భవనాల యజమానులు కనీసం నిబంధనలు పాటించకుండా నిర్మాణాలు చేపట్టారు. సెట్ బాక్స్ వదలకుండా.. టీడీఆర్ తీసుకుని ఐదు ఫ్లోర్‌ల నిర్మాణం చేపట్టారు. కనీసం పార్కింగ్ లేకుండా బహుళ అంతస్థుల భవనాలు నిర్మించేశారు. ఎవరైనా ఆయా షాపులకు వెళితే రోడ్డుపైనే వాహనాలు పార్కింగ్ చేపడుతున్నారు. ఇక్కడ విస్తరణకు చర్యలు చేపట్టాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు రాజకీయ ఒత్తిళ్లతో చేతులెత్తేస్తున్నారు. అమాయకులు, రాజకీయ పలుకుబడి లేని వారి ఇళ్ల ముందు మాత్రం కచ్చితంగా 66 అడుగులను విస్తరిస్తున్నారు. దీంతో చాలా మంది ఈ పనులపై పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా అందరికీ ఒకే నిబంధన వర్తింపచేసి రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేయాలని కోరుతున్నారు.

ఈ విషయమై అసిస్టెంట్ టౌన్ ప్లానింగ్ అధికారి మధుసూధనరావు వివరణ కోరగా 'అంతా నిబంధనల ప్రకారమే రోడ్డు విస్తరణ జరుగుతోంది. ఏమైనా లోపాలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలి. ఆయా నిర్మాణాలను పరిశీలించి, నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామ'ని తెలిపారు.



అంబటి సత్రం నుంచి కొత్తపేటకు వెళ్లేదారిలో మలుపులు తిరిగిన కాలువ

ప్రీపోల్ ఏర్పాట్లను పూర్తి చేయాలి

- పోలింగ్ స్టేషన్లను సిద్ధంగా ఉంచాలి
- కలెక్టర్ నాగలక్ష్మి


మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టరేట్, ఫిబ్రవరి 28: ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే ప్రీపోల్ ఏర్పాట్లను పూర్తి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సెక్టార్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల పాత్ర అత్యంత కీలకమైందని చెప్పారు. నోటిఫికేషన్ విడుదలైన నుంచి ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌కి తెచ్చే వరకూ బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. 'సెక్టార్ అధికారులు, పోలీసులు సమన్వయంతో ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చూడాలి. ప్రతి సెక్టార్ అధికారికి 10 నుంచి 12 పోలింగ్ స్టేషన్ల పరిధి ఉంటుంది. వీటిని పోలీసు అధికారులతో కలిసి ముందే తనిఖీ చేసుకోవాలి. సెక్టార్ అధికారులకు మెజిస్టీరియల్ పవర్స్ ఉంటాయి. పోలింగ్ స్టేషన్లను సందర్శించి కనీస అవసరాలను పరిశీలించాలి. ర్యాంప్‌లు, ఫర్నిచర్, టాయిలెట్స్, తాగునీరు ఏర్పాటు చేయాలి. బూత్ నెంబర్లను వేయాలి. ఓటర్ల కోసం నీడ సదుపాయం కల్పించాలి. ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలి. పోల్ పర్సంటేజ్‌ను తెలియజేయడానికి ఇంటర్నెట్ కనెక్షన్ ఏర్పాటు చేయాలి. పోలింగ్ స్టేషన్ల వారిగా ఎంతమంది ఓటర్లు ఉన్నారు? దివ్యాంగులు, వృద్ధులు తదితర సమాచారాన్ని కలిగి ఉండాలి. దివ్యాంగులు, 80 ఏళ్ల దాటిన వారు, ఓటింగ్‌కు రాలేని వారి కోసం అధికారులే వాహనాలు ఏర్పాటు చేయాలి. సెక్టార్ అధికారులు పోలీస్ అధికారులతో కలిసి వారి పోలింగ్ స్టేషన్లకు సంబంధించి ఏ రూట్ ఎలా ఉంది? అనేది తెలుసుకోవాలి.' అని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్, డీఆర్వో అనిత, సహాయ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, మెప్మా పీడీ సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అవగాహన కార్యక్రమాలు

స్వీప్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో శుక్రవారం నుంచి ఓటర్ల అవగాహన కార్యక్రమాలను ముమ్మరం చేస్తామని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేశారు. తన చాంబర్‌లో రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కౌంటింగ్ సెంటర్లను ఖారారు చేసి, జాబితాను మార్చి 5 లోగా పంపించాల్సి ఉంటుందని తెలిపారు.

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు

- పార్టీలతో సంబంధం లేకుండా బైండోవర్
- నేర సమీక్షలో ఎస్పీ దీపిక


నేర సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ దీపిక

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 28: జిల్లాలో ఎన్నికల నియామవళి, నిబంధనలను ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేయాలని ఎస్పీ దీపిక పోలీసులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మాసాంతర నేర సమీక్షలో ఆమె మాట్లాడారు. వాహన తనిఖీలతో పాటు లాడ్జీల్లో తనిఖీలు చేపట్టాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టాలని ఆదేశించారు. 'గ్రామస్థాయిలో సమస్యలు సృష్టించే వ్యక్తులను పార్టీలతో సంబంధం లేకుండా గుర్తించి బైండోవర్ చేయాలి. స్థానిక తహసీల్దార్ కార్యాలయాల్లో వారిపై బాండ్లను ఎగ్జిక్యూట్ చేయాలి. సోషల్ మీడియాలో పెట్టే పోస్టులపై ప్రత్యేక నిఘా పెట్టాలి. స్టేషన్ స్థాయిలో సమస్యలను సృష్టించే వ్యక్తులను గుర్తించాలి. ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో అనధికార మద్యం విక్రయాలపై ముందస్తు సమాచారం సేకరించాలి. పెద్దమొత్తం మద్యం స్వాధీనం చేసుకునే విధంగా నిఘా ఏర్పాటు చేయాలి. పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిల్‌బుల్ వారెంట్లను ఎగ్జిక్యూట్ చేసేందుకు చర్యలు చేపట్టాలి. శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలి. ఎన్నికల ప్రచారం కోసం అనుమతులు కోరుతూ వివిధ పార్టీ నాయకులు చేసే దరఖాస్తు వివరాలను నమోదు చేసేందుకు ప్రత్యేకంగా రిజిస్టర్‌ని ఏర్పాటు చేయాలి.' అని ఎస్పీ ఆదేశించారు. అనంతరం జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ ఆస్మాపరహీన్, ట్రైనీ ఐపీఎస్ మండా జావిలీ అల్ఫాన్స్, డీఎస్పీలు గోవిందరావు, శ్రీనివాసరావు, చక్రవర్తి, వీరకుమార్, విశ్వనాథ్, మహేంద్ర, న్యాయసలహాదారు పరుశురాం, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేశవరావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.


హాజరైన పోలీసు అధికారులు

వైసీపీకి ఓటేస్తే.. రాష్ట్రం సర్వనాశనమే

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 28: వైసీపీకి ఓటేస్తే.. రాష్ట్రం సర్వనాశనమవుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు అన్నారు. స్థానిక శ్రేణులతో కలిసి బుధవారం 33, 34 డివిజన్‌ల పరిధిలో ఇంటింటికి వెళ్లి టీడీపీ సూపర్ సిక్స్ హామీలను వివరించారు. అనంతరం మాట్లాడుతూ యువతను నిట్టనిలువునా మోసం చేశారన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్ అంటూ ప్రకటించి, ఆ హామీని విస్మరించారన్నారు. దీంతో యువత ఇబ్బందికర పరిస్థితుల్లో దురలవాట్లకు బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై అత్యాచారాలు, దాడులు పెరిగాయన్నారు. నిత్యావసరాలు, కాయగూరల ధరలు ఆకాశన్నంటాయన్నారు. ప్రజలంతా టీడీపీ-జనసేకు మద్దతు ఇవ్వాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకా అనంతలక్ష్మి, రాజపుత్రుని ధనలక్ష్మి, రమేష్‌బాబు, ఎన్‌వీఎస్ రాజు, మహంతి శ్రీను, డీవీవీ రాయుడు, శిడగం సంతోష్‌తో పాటు నగర టీడీపీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ● నగరంలోని ఒకటో డివిజన్‌కు చెందిన సోమాదుల శ్రీను, రమణయ్య, రవికుమార్‌లతో పాటు 42 కుటుంబాలకు చెందిన వారు బుధవారం వైసీపీకి రాజీనామా చేసి.. టీడీపీ గూటికి చేరారు. పార్టీ కార్యాలయం అశోక్ బంగ్లాలో నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి అదితి గజపతిరాజు వారికి పసుపు కండువాలు వేసి ఆహ్వానించారు. ఒకటో డివిజన్ నాయకులు మురగడాపు పార్వతి, నక్కిళ్ల శ్రీనివాసరావు, బొద్దాన లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


అదితీని ఆశీర్వదిస్తున్న వృద్ధురాలు

జగన్ పాలనలో అభివృద్ధి శూన్యం

● మాజీ మంత్రి కోండ్రు

రాజాం, ఫిబ్రవరి 28: సీఎం జగన్‌రెడ్డి పాలనలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని రాష్ట్రం అన్నిరంగాల్లోనూ విఫలమైందని మాజీ మంత్రి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ అన్నారు. బుధవారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో వంగర మండలం వీవీఆర్‌పేట, రాజులగుమ్మడ గ్రామాలకు చెందిన 30 ఎస్సీ కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీలు పూర్తిగా దగా పడ్డారని, చంద్రబాబు పాలనలో దళితులకు ఎన్నో పథకాలు ఇచ్చారని, మహిళల కోసం 22 పథకాలు తెచ్చిన పార్టీ టీడీపీ అన్నారు. అనంతరం రాజాం పట్టణానికి చెందిన అన్నపూర్ణ రైస్‌మిల్లు యజమాని మోనింగి శ్రీరామూర్తి, కుప్పిలి శ్రీను, ఆమిటి శ్రీరామూర్తి, తదితరులు టీడీపీలో చేరారు. ● తెలుగుదేశం జగనసేన కూటమితో వైసీపీ కోటలకు బీటలు ఖాయమని మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ అన్నారు. బుధవారం పట్టణం పరిధిలోని 10, 11, 12, 13 వార్డుల నాయకులు, కార్యకర్తలు అభిమానులతో నిర్వహించిన రివ్యూ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల శంఖారావానికి ప్రతి ఒక్క తెలుగుదేశం నాయకుడు సయాత్తం కావాలన్నారు. నంది సూర్యప్రకాష్‌రావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, గురవాన నారాయణరావు, టంకాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన వారితో కోండ్రు

వివాహం కావడం లేదని..

● మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

భోగాపురం, ఫిబ్రవరి 28: వివాహం కావడంలేదని మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి సీఐ రవికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉనాయి. మండలం భోగాపురం పంచాయతీ సుందరపేట గ్రామానికి చెందిన ఇనపకుర్తి జగదీష్(28) విశాఖలోని పారెస్టు డిపార్టుమెంటులో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. అయితే ఇతనికి ఇంకా వివాహం కాలేదు. ఎన్ని పెళ్లి సంబంధాలు చూస్తున్నా ఏవీ కుదరడం లేదు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం విధులనుంచి ఇంటికి చేరుకొని సమీప సరుగుడు తోటలోకి వెళ్లాడు. అయితే ఎంతకీ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అంతటా గాలించారు. సరుగుడు తోటలో అపస్మారకస్థితిలో పడి ఉండడం, పక్కనే గడ్డి మందు డబ్బాను గమనించి ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. వెంటనే విజయనగరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడికి తల్లిదండ్రులు, అన్నయ్య ఉన్నారు. మృతుడి తండ్రి ఇనపకుర్తి వెంకటరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

భామిని: మండలంలోని బాలేరు గ్రామానికి చెందిన గౌడు మురళీ రోడ్డు ప్రమాదంలో గాయాలపాలయ్యాడు. గ్రామం నుంచి సెంటర్‌కు వస్తుండగా బత్తిలి వైపు నుంచి కొత్తూరు వెళుతున్న లారీ ఢీకొనడంతో గాయాలపాలవ్వగా స్థానికులు వెంటనే బాలేరు పీహెచ్‌సీకి తరలించారు. బాలేరులో ప్రథమ చికిత్స అందగా మెరుగైన వైద్యం కోసం పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా సలానికి చేరుకుని పరిశీలించారు. ఏఎస్ఐ కాంతారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

బొబ్బిలి: బొబ్బిలి-డొంకినవలస రైల్వే లైనులో బుధవారం సుమారు 45 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే ఎస్ఐ పి.రవివర్మ తెలిపిన వివరాల మేరకు.. ఆ వ్యక్తి రైలు నుంచి జారిపడడం లేదా పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడం వల్లగానీ మృతిచెంది ఉంటాడని భావిస్తున్నామని చెప్పారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచామన్నారు. షర్టు, లుంగీ ధరించి ఉన్న ఆ వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు విజయనగరం రైల్వే ఎస్ఐ పి.రవివర్మ (9490617089), బొబ్బిలి రైల్వే ఔట్ పోస్టు ఇన్‌చార్జి ఎస్.కృష్ణారావు (9441013330)లను సంప్రదించాలని కోరారు.

భార్యను వేధించిన కేసులో ఏడాది జైలు

● తూర్పుగోదావరి జిల్లా వాసికి శిక్ష

బొబ్బిలి, ఫిబ్రవరి 28: భార్యను వేధించిన కేసులో భర్తకు ఏడాది జైలు, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ అదనపు జిల్లా న్యాయాధికారి దామోదరరావు బుధవారం తీర్పును వెలువరించినట్లు బొబ్బిలి సీఐ మలిరెడ్డి నాగేశ్వరరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం బొబ్బిలి పట్టణంలోని యాతవీధికి చెందిన లెంక గోవిందమ్మకు తూర్పుగోదావరి జిల్లా మండపేట మండలం సైదులుపేట గ్రామానికి చెందిన లెంక రామనాయుడుతో వివాహం జరిగిందని, వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. తన భర్త తరచూ శారీరకంగా, మానసికంగా హింసిస్తూ, అదనపు కట్నం కోసం వేధిస్తుండడంతో 2014 డిసెంబరు 20 న బొబ్బిలి పోలీసు స్టేషన్‌లో భార్య ఫిర్యాదు చేసింది. దీనిపై అప్పటి ఎస్ఐ నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు సాగించారు. కేసు పూర్వాపరాలను విచారించిన మీదట ముద్దాయి రామనాయుడుకు ఒక ఏడాది సాధారణ జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ జడ్జి దామోదరరావు బుధవారం తీర్పు చెప్పినట్లు సీఐ తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వెంకటరావు వ్యవహరించారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

రేగిడి: వావిలవలస గ్రామంలో బుధవారం ఒక వ్యక్తి 25 మద్యం సీసాలతో పట్టుబడినట్లు ఏఎస్ఐ రాజారావు తెలిపారు. ఈ మేరకు నిందితుని అరెస్టు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు. ఆయన వెంట కానిస్టేబుల్ శివ, సిబ్బంది ఉన్నారు.

జగన్ పాలనలో ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి: కోండ్రు

రాజాం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని మాజీ మంత్రి నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జీ కోండ్రు మురళీమోహన్ అన్నారు. బుధవారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో కోండ్రును కలిసిన యుటిఎఫ్ నాయకులు ఉపాధ్యాయులు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో ఐదున్నర లక్షల ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అతి తక్కువ వేతనాలతో పాటు పదవీ విరమణ బెనిఫిట్స్‌గాని ఎటువంటి ఇతర సౌకర్యాలుగాని కల్పించిన పరిస్థితి లేదని కోండ్రుకు వివరించారు. ఈ సందర్భంగా కోండ్రు మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని మళ్లీ చంద్రబాబునాయుడు సీఎం అయితేనే మీ సమస్యలకు పరిష్కార మార్గం ఏర్పడుతుందన్నారు. రిటైర్డ్ హెచ్ఎం జరజాన నీలయ్య, ఉమా, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహన్‌రావ, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుణ్యగిరి రోడ్డును బాగు చేస్తేనే బస్సులు నడపగలం

శృంగవరపుకోట: మహా శివరాత్రికి జరగనున్న శృంగవరపుకోట శ్రీఉమాకోటి లింగేశ్వరస్వామి, దార గంగమ్మ జాతరకు ఆర్టీసీ బస్సులను తిప్పేందుకు రోడ్డును బాగు చేయాలని డిపో మేనేజర్ కె.రమేష్ కోరారు. ఈ మేరకు బుధవారం పంచాయతీ అధికారులకు వినతిపత్రం పంపించారు.

ఆరు రోజులుగా తాగునీటి సరఫరా నిలిపివేత

శృంగవరపుకోట: తాటిపూడి పైలెట్ ప్రాజెక్టు నుంచి ఆరు రోజులుగా శృంగవరపుకోట నియోజకవర్గంలోని పలు గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. రెండు రోజులుగా రేపు, మాపని ప్రాజెక్టు అధికారులు చెప్పడమే కానీ ఇప్పటివరకూ సరఫరా మాత్రంపునరిద్ధరించకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

నేటి నుంచి ప్రత్యేక పూజలు

కొత్తవలస: కొత్తవలస పంచాయతీ ఎన్జీవోస్ కాలనీకి సంబంధించిన గరుడాద్రి కొండపై వెలసిన గరుడాద్రి కల్యాణ వేంకటేశ్వరస్వామి ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమాన్ని మార్చి 1 న నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు బోని వెంకట అప్పారావు తెలిపారు. కొండపై స్వామివారి విగ్రహాలను ప్రతిష్ఠించి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఈ నెల 29 నుంచే ఉత్సవాలను ప్రారంభించడం జరుగుతుందన్నారు. మార్చి 1న విశేష అభిషేకాలతో పాటు హోమాలు, మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ఘనంగా టైలర్ల దినోత్సవం

రామభద్రపురం: ఆరికతోటలో బుధవారం అంతర్జాతీయ టైలర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. టైలర్ల జీవనోపాధికి ఇబ్బందిగా ఉందని ఆ సంఘ ప్రతినిదులు సీరాపు భాస్కరరావు, బొజ్జా నారాయణరావు, పెంకి రాములు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దర్జీల ఉపాధి కోసం మెరుగైన పథకాలు రూ పొందించాలని కోరారు. 50 సంవత్సరాలు నిండిన టైలర్లకు పింఛన్లు, బ్యాంకు రుణాలు, వంటివి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గార నారాయణరావు, కృష్ణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెక్టార్ సమావేశం

తెర్లాం: పెరుమాళిలోని అంగన్‌వాడీ-1 కేంద్రంలో సూపర్‌వైజర్ చిట్టెమ్మ ఆధ్వర్యంలో సెక్టార్ సమావేశం నిర్వహించారు. బాడంగి ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ కె.రాజ్యలక్ష్మి హాజరయ్యారు. స్థానికంగా ఉన్న మూడు కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవస్థానం ఆధ్వర్యంలో ప్రసాదాలు

రాజాం: శ్రీ పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర సందర్భంగా ప్రసాదాలను దేవస్థానం తరపున విక్రయిస్తామని ఈవో మాధవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రసాదాల విక్రయానికి గతంలో బహిరంగ వేలం వేసేవారని, ఈ ఏడాది నుంచి దేవదాయ శాఖ తరపున విక్రయిస్తామన్నారు. పులిహోర ప్యాకెట్ ధర రూ.10, లడ్డూ రూ.15గా నిర్ణయించినట్టు తెలిపారు.

26 రోజులకే తహసీల్దార్ బదిలీ

వంగర: వంగర తహసీల్దార్ కె.సుదర్శనరావు ఈ నెల 2న బాధ్యతలు చేపట్టారు. తాజాగా బుధవారం ఆయనను నర్సీపట్నం బదిలీ చేశారు. ఆ స్థానంలో పార్వతీపురం కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న చిరంజీవిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన బుధవారం విధుల్లో చేరారు. ఇదిలా ఉండగా వంగర ఎంపీడీఓగా నియమితులైన ఎం.సాల్మన్‌రాజ్ కూడా బుధవారం బాధ్యతలు చేపట్టారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

బొబ్బిలి, ఫిబ్రవరి 28: మెట్టవలస గ్రామంలో బుధవారం రాత్రి బాల్య వివాహాన్ని అధికార యంత్రాంగం అడ్డుకుంది. గ్రామానికి చెందిన ఓ బాలికకు తల్లిదండ్రులు లేకపోవడంతో నాన్నమ్మ సంరక్షణలో ఉంటోంది. ఆమెకు ఓ తమ్ముడు ఉన్నాడు. నాన్నమ్మ వృద్ధాప్య సమస్యలతో బాధ పడుతోంది. ఇంటర్ చదువుతున్న తన మనవరాలికి సమీప బంధువుతో పెళ్లికి నాన్నమ్మ ఏర్పాట్లు చేసింది. ఇంతలో అధికారులు వచ్చి.. బాల్య వివాహం వల్ల జరిగే అనర్థాలను వివరించి అడ్డుకున్నారు. గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలు పువ్వల మాధవరావు, అర సాడ శంకరరావు, సుంకరి అప్పారావు సమక్షంలో పెళ్లికి సంబంధించిన వారి నుంచి స్టేట్‌మెంట్లను రికార్డు చేశారు.

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల

విజయనగరం(ఆంధ్రజ్యోతి) ఫిబ్రవరి 28: జిల్లా పరిషత్, మండల పరిషత్‌లకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను 15వ ఆర్థిక సంఘం నిధులు మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ విడుదలైనట్లు జడ్పీ సీఈవో రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్‌కు మొదటి వాయిదా కింద టైడ్, బేసిక్ గ్రాంట్లు కలిసి మొత్తం రూ 8,11,66,714 విడుదలయ్యాయన్నారు. జిల్లా పరిషత్ పరిధిలో 34 మండల పరిషత్‌లకు 2023-24 సంవత్సరానికి మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ టైడ్, బేసిక్ గ్రాంట్లు కలిసి రూ 8,12,85,870 విడుదలైనట్లు పేర్కొన్నారు.

రైతులకు మూడో విడత రైతు భరోసా

కలెక్టరేట్: వైఎస్ఆర్ రైతు భరోసా నిధులను సీఎం జగన్ బుధవారం విడుదల చేసినట్లు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. జిల్లాలోని రైతులకు రూ 52.73 కోట్ల మొత్తాన్ని బటన్ నొక్కి సీఎం జమ చేసినట్లు తెలిపారు. కలెక్టర్ కార్యాలయం నుంచి సీఎం జగన్ వర్చ్యువల్ సమావేశంలో నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో వైఎస్ఆర్ రైతు భరోసా పథకం ద్వారా గత ఐదేళ్లలో రైతులకు రూ 1629.35 కోట్ల సహాయాన్ని పొందారని తెలిపారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎంఎల్ఏ ఎస్వి చినప్పలనాయుడు, ఎంఎల్‌సి సురేష్ బాబు, జేసీ కార్తీక్, ట్రైనీ ఆసిస్టెంట్ కలెక్టరు త్రివినాగ్ పాల్గొన్నారు.

పైపులైన్లు పూర్తి చేయరా?

రామభద్రపురం, ఫిబ్రవరి 28: బూసాయవలసలో జలజీవన్ మిషన్ కింద మంచి నీటి కుళాయిలు మంజూరై 4 నెలలైనా పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇస్తామని చెప్పి రోడ్లను పూర్తిగా ధ్వంసం చేశారని.. ఇప్పటికీ నీరు రావడం లేదని స్థానికులు వాపోయారు. ఈ సమస్య పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈని ఎన్నిసార్లు కోరినా ఫలితం లేకపోతోందని సర్పంచ్ ప్రతినిధి గంట సాయికుమార్ తెలిపారు.


పైపులైన్ల కోసం తవ్వి వదిలిలేసిన దృశ్యం

టీడీపీతోనే బీసీల భవిష్యత్తు

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 28: బీసీల భవిష్యత్తు టీడీపీతోనే బాగుంటుందని.. రానున్న ఎన్నికల్లో బీసీలంతా ఐక్యంగా టీడీపీ-జనసేనకు మద్దతు ఇవ్వాలని టీడీపీ తూర్పు కాపు రాష్ట్ర కమిటీ కన్వీనర్ కంది మురళీనాయుడు పిలుపునిచ్చారు. జయహో బీసీ కార్యక్రమంలో భాగంగా బుధవారం కొత్తపేట, యాదవ వీధిలో ప్రత్యేక సభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా బీసీలను ముందుకు తీసుకువెళ్లింది టీడీపీయేనన్నారు. 2014 నుంచి 2019 వరకూ బీసీలకు రుణాలు, ఆదరణ వంటి పథకాలు ఏర్పాటు చేసిందన్నారు. నిధులు, విధులు, అధికారాలు లేని కార్పొరేషన్‌లతో బీసీలను మోసం చేసిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. చందక స్వప్న యాదవ్, మద్దాల జగదాంబ, నాగమ్మ, రామరాజు, యూవీ రాజేష్, టీడీపీ బీసీ విభాగం నాయకులు దేవేంద్రనాథ్, బోని కుమార్, గోపి, కోరాడ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కంది మురళీనాయుడు కొత్తపేట వద్ద టీడీపీ పతాకాన్ని ఆవిష్కరించారు.


నినాదాలు చేస్తున్న టీడీపీ నాయకులు

పెరుమాళిలో 'బాబు ష్యూరిటీ..'

తెర్లాం, ఫిబ్రవరి 28: మండలంలోని పెరుమాళి గ్రామంలో టీడీపీ నాయకుడు అప్పల నరసింహరాజు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవి ష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రా మంలోని ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటువేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. గ్రామ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న టీడీపీ నాయకుడు

అధిష్ఠానం దృష్టికి కార్యకర్తల అభిప్రాయాలు

జామి, ఫిబ్రవరి 28: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడును టీడీపీ అభ్యర్థిగా ప్రకటించాలని మండలంలోని 16 పంచాయతీల కార్యకర్తలు, నాయకులు తీర్మానం చేశారు. బుధవారం భీమసింగిలో మాజీ ఎమ్మెల్యే కేఏనాయుడు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేఏ నాయుడు మాట్లాడుతూ అధిష్ఠానా నికి కార్యకర్తల మనోభావాలను వివరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో స్వామినాయుడు, కొత్తలి సూర్యారావు, పైడిరాజు, జనార్దనరావు, మాకిరెడ్డి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కేఏ నాయుడు

నేతల భవిష్యత్ నిర్ణయించేది మన ఓటే

శృంగవరపుకోట, ఫిబ్రవరి 28: రాజకీయ నేతల బవిష్యత్‌ను నిర్ణ యించేది మన ఓటే నని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్ ప్రసాద్ అన్నారు. బుధవారం సాయంత్రం శృంగవరపుకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓట్ ఫర్ ఓపీఎస్-ఉద్యోగుల పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్ అనేమాటలు కా కుండ ఓపీఎస్ అమలు చేసే వారికే మా ఓటేనే విషయాన్ని రాజకీయ నాయ కులు నిర్వహించే సభల వద్ద ప్లకార్డులు ప్రదర్శించాలని సూచించారు. ముఖ్య మైన కూడలిలోను ఓట్‌ఫర్ ఓపీఎస్ గోడపత్రికలను అతికించాలన్నారు. యూ టీఎఫ్ కార్యదర్శి ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి జీవీరమణ, సీనియర్ నాయకులు గూనూరు వెంకటరావు తదితరులున్నారు.


మాట్లాడుతున్న ప్రసాద్

'ఓట్ ఫర్ ఓపీఎస్' పుస్తకం ఆవిష్కరణ

కొత్తవలస, ఫిబ్రవరి 28: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే వారికే ఓటు అని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్ అన్నారు. బుధవారం కొత్తవలస జడ్పీహైస్కూల్‌లో 'ఓట్ ఫర్ ఓపీఎస్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం వల్లనే ఉద్యోగులకు న్యాయం జరుగుతుందన్నారు. దీన్ని అమలు చేసే ప్రభుత్వానికే ఓటు వేయాలనే ధ్యేయంతో ఓట్ ఫర్ ఓపీఎస్ పుస్తకం ఆవిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జె.వి.ఆర్.కె.ఈశ్వరరావు, యూటీఎఫ్ ప్రతినిధులు జి.పార్వతి, సీహెచ్ నిర్మలాదేవి, జి.విజయగౌరి, జి.వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.


పుస్తకం ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

అభ్యసన సామర్థ్యం పెరగాలి

● రాష్ట్ర ఎల్ఐటీ కో ఆర్డినేటర్ ఉపేంద్రరెడ్డి

రామభద్రపురం, ఫిబ్రవరి 28: పాఠశాల విద్యార్థుల్లో అభ్యసనాభివృద్ధిని పెంపొందించేలా బోధనా పద్ధతులు ఉండాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఏపీ విద్యాశాఖ బోధనాభివృద్ధి పథకం రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ ఉపేంద్రరెడ్డి అన్నారు. బూసాయవలస కస్తూరిబాగాంధీ బాలికల కళాశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. 8వ తరగతి విద్యార్థులకు వివిధ అంశాలపై ప్రశ్నలు అడిగారు. ఉపాధ్యాయుల బోధనా విధానాన్ని ఎప్పటికప్పుడు మెరుగుపరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రిసోర్సుపర్సన్ ప్రవీణ్ కుమార్, స్థానిక కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దమయంతి పాల్గొన్నారు. ● **సీతానగరం:** మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను ఏపీ విద్యాశాఖ బోధనాభివృద్ధి పథకం రాష్ట్ర సమన్వయకర్త ఉపేంద్రరెడ్డి బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిలించారు. ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి బోధనా మెలకువలను అవగాహన కల్పించారు. ఎంఈవో సూరిదేముడు, హెచ్ఎం లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను ప్రశ్నిస్తున్న ఉపేంద్రరెడ్డి

రోడ్డుకు మరమ్మతులు

బాడంగి, ఫిబ్రవరి 28: పినపెంకి నుంచి జీకేఆర్ పురం వెళ్లే రహదారి పూర్తిగా అధ్వానంగా మారింది. నెల రోజులుగా బస్సుల రాకపోకలు కూడా నిలిచిపోయాయి. దీంతో వాడాడ పాఠశాలకు వెళ్లే విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఈ విషయాన్ని స్థానిక టీడీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన దృష్టికి స్థానికులు తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన బేబీనాయన రూ.20 వేలు, జీకేఆర్ పురం గ్రామస్థులు రూ.6వేలు వెచ్చించి రోడ్డుకు మరమ్మతులు చేయించారు.


రోడ్డుకు మరమ్మతు పనులు నిర్వహించిన దృశ్యం

కొలతలతోనే వేతనం గిట్టుబాటు

రేగిడి, ఫిబ్రవరి 28: ఉపాధి వేతనదారులు రెండు పూటలా పని చేయాలని.. కొలతల ప్రమాణాలు పాటించాలని... అప్పుడు రూ. 272 వేతనం గిట్టుబాటు అవుతుందని ఏపీఓ హరినాథ్ సూచించారు. లచ్చరాయపురం పేడ కోనేరులో ఉపాధి పనిని బుధవారం ఏపీఓ హరనాథ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మస్తర్లు పరిశీలించారు. వేతనం గిట్టుబాటుపై పశ్నించారు.

పరీక్షలు బాధ్యతగా నిర్వహించాలి

వంగర, ఫిబ్రవరి 28: మడ్డువలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మార్చి 1 నుంచి ఇంటర్ పరీక్షలను బాధ్యతగా నిర్వహించాలని ఎంఈవో పి.ప్రవీణ్ సూచించారు. మాల్ ప్రాక్టీసుకు సహకరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్థలాల కబ్జాకు అడ్డుకట్ట లేదా?

● సీపీఐ నాయకుల ధ్వజం

బొబ్బిలి, ఫిబ్రవరి 28: బొబ్బిలి పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో పేదలకు చెందిన ఖాళీ ఇళ్ల స్థలాలు పెద్ద ఎత్తున కబ్జాకు గురవుతున్నాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్న ఆరోపించారు. బుధవారం ఆయన కబ్జాకు గురైన స్థలంలో విలేకరులతో మాట్లాడారు. ఖాళీ స్థలాల్లో అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టి చేతులు దులుపుకున్నారని, వాటిని ఆక్రమణదారులు తొలగించి నిర్మాణాలు సాగించుకుంటున్నారన్నారు. ఇకనైనా అధికారులు అక్రమాలకు చెక్ పెట్టకపోతే పోరాటం చేయాల్సి ఉంటుందని అప్పన్న అన్నారు. ఆయన వెంట కె.సత్యనారాయణ, హరి ఉన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

గాంధీజీ ఆశయ సాధనకు పనిచేయాలి

రాజాం: గాంధీజీ ఆశయాలు నెరవేరాలంటే బాలలు క్రమశిక్షణతో మెల గాలని రాజాం రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్ కుమార్ అన్నారు. ఆయన బుధవారం సీవీరామన్ జయంతి సందర్భంగా వీఆర్ అగ్రహారం పాఠశాలలో గాంధీజీ విగ్రహాన్ని నూతనంగా ఆవిష్కరించి నివాళి అర్పించారు. ప్రధానోపాధ్యాయులు వి.నారాయణమ్మ, కూరాడ హరి, డి వెంకటరమణ, వై రామకృష్ణ, రెడ్ క్రాస్ కన్వీనర్ పెంకి చైతన్యకుమార్, బీవీ అచ్యుతకుమార్ పాల్గొన్నారు.


గాంధీ విగ్రహావిష్కరణ చేస్తున్న దృశ్యం

అందరి సహకారంతో పంచాయతీ అభివృద్ధి

కొత్తవలస: జిల్లాలోనే అతి పెద్ద మేజర్ పంచాయతీ అయిన కొత్తవలస మేజర్ పంచాయతీలో పాలక మండలి సభ్యులు, అధికారులు, ప్రజల సహకారంతో అభివృద్ధి పనులు చేస్తున్నామని మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ యర్రయ్య రామస్వామి అన్నారు. బుధవారం పంచాయతీ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీపరిధిలోని ప్రతి వార్డులోను, ఆ వార్డుకు సంబంధించిన సమస్యలను గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఉద్యోగుల జీతాల కోసం 56 లక్షలు రూపాయలు చెల్లించగా జనరల్‌ఫండ్‌లో ఇంకా 13 లక్షల 30 వేల రూపాయలు మిగులు నిధులు ఉన్నాయన్నారు. 8లక్షల రూపాయలను విద్యుత్ పనులకు వినియోగించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ఈవో కన్నబాబు పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

రేగిడి, ఫిబ్రవరి 28: అగ్ని ప్రమాదాల నియంత్రణ, నివారణ చర్యలపై పాలకొండ అగ్నిమాపక శాఖ సిబ్బంది బుధవారం సంకిలి హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారి జామి సర్వేశ్వరరావు, హెచ్ఎం రామినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

బొబ్బిలి, ఫిబ్రవరి 28: సర్ సీవీ రామన్ జయంతిని పురస్కరించుకొని జాతీయ సైన్స్‌దినోత్సవాన్ని బుధవారం బొబ్బిలి పట్టణం, మండలంలోని పలు విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక గొల్లపల్లి శ్రీవేణుగోపాల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం సైన్స్ ప్రాధాన్యతను, లక్ష్యాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. నారసింహునిపేట జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఈ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కోమటిపల్లి జడ్పీ హైస్కూలు హెచ్ఎం సూర్యకుమారి, సైన్స్ ఉపాధ్యాయులు ఎస్.శివన్నారాయణ, సీహెచ్ వెంకటరమణ ఆధ్వర్యంలో విద్యార్థులు సైన్స్ లోగో ఆకృతిలో ఏర్పడి ప్రదర్శన ఇచ్చారు.

రాజాం రూరల్: సైన్స్‌తోనే మానవ మనుగడ ముడిపడి ఉందని కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు పండూరు వేణు గోపాల్ స్పష్టం చేశారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో బుధవారం నిర్వహించిన కా ర్యక్రమంలో సర్ సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాల లు వేసి నివాళులర్పించారు. ప్రయోగాలు, ఫొటోల ప్ర దర్శనలు ఏర్పాటు చేశారు. ● **రాజాం:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సైన్స్ దినో త్సవం నిర్వహించారు. ఆప్ కాస్ట్ తరుపున జిల్లా సైన్స్ అధికారి మిరియాల కృష్ణారావు, జిల్లా సైన్స్ కో ఆనొకడనేటర్ టి రాజేష్ హాజరయ్యారు. సైన్స్ డే సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు తయారు చేసిన ప్రోజెక్టులను ప్రదర్శించారు.

● **శృంగవరపుకోట రూరల్:** ధర్మవరం, సంతగైరమ్మపేట ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం సైన్స్‌డే వే డుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు చేసిన పలు ప్రదర్శనలు ఆకట్టుకు న్నాయి. ● **బాడంగి:** స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్ సి.వి.రామన్ చిత్ర పటానికి పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ నివాళులర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ● **గజపతినగరం:** సైన్స్‌తో ఎంతో విజ్ఞానాన్ని పొందవచ్చునని ఎంఈవో ఎస్.విమలమ్మ అన్నారు. బుధవారం సైన్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రమేష్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● **వంగర:** విద్యార్థుల మనుగడ సైన్స్‌తో ముడిపడి ఉందని హెచ్ఎం జగదీశ్వరి, కస్తూరిబా గాంధీ ప్రత్యేకాధికారి రోహిణి అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా అరసాడ, వంగరలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ● **గరివిడి:** తాటిగూడ జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం పి.మధుసూదన్ ఆధ్వర్యంలో బుధవారం సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంఈవో పి.రామారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు.


బొబ్బిలి: కోమటిపల్లి జడ్పీ హైస్కూల్లో విద్యార్థుల ప్రదర్శన


రాజాం మండలం కంచరాంలో..


గజపతినగరంలో..

నూతన వేతన ఒప్పందం చేయాలి



కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు శంకరరావు

నెల్లిమర్ల: రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ బెవరేజస్ హమాలీ కార్మికుల ఎగుమతి, దిగుమతి పీస్ రేట్లు ఒప్పందం పూర్తియి 3 నెలలు దాటిందని, కొత్త కాంట్రాక్టర్‌తో నూతన వేతన ఒప్పందం చేయాలని సీఐటీయూ నాయకుడు రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు నెల్లిమర్లలో బుధవారం ఐఎంఎల్ డిపో ఎదుట నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీను, డిపో కార్యదర్శి కార్తీక్ పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

నెల్లిమర్ల: స్థానిక రామతీర్థం జంక్షన్‌లోని ప్రాథమిక పాఠశాలను ఎస్సీఈఆర్టీ ఐబీ బృందం బుధవారం సందర్శించింది. పాఠశాలలో నిర్వహిస్తున్న అభ్యసనాభివృద్ధి కార్యక్రమాన్ని పరిశీలించారు. విద్యార్థుల పక్కనే కూర్చుని వివరాలపై ఆరా తీశారు. అలాగే ఉపాధ్యాయులతోనూ మాట్లాడారు. విద్యా ప్రణాళిక, బోధనాభ్యాసన విధానాలపై డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్.. ఎస్సీఈఆర్టీ ప్రతినిధులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీఈఆర్టీ ప్రొఫెసర్ కేశిరాజు శ్రీనివాస్, సీనియర్ కరిక్యులర్ డిజైన్ మేనేజర్ మిస్టర్ అల్లో అసెస్మెంట్ ఆపరేషన్స్ అసోసియేట్ మేనేజర్ మిస్టర్ మైఖేల్, విజయనగరం డైట్ సీనియర్ లెక్చరర్ డా.ఎస్టీ నాయుడు, ఏఎంవో బి.ప్రసాదరావు, సీఎంవో వి.ఆదినారాయణ, నెల్లిమర్ల ఎంఈవోలు ఉపాధ్యాయుల సూర్యనారాయణమూర్తి, ఈపు విజయ్ కుమార్, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ సీహెచ్ ఆనందమూర్తి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం జనార్ధనరావు, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ విద్యపై ఆరా

నెల్లిమర్ల: నెల్లిమర్లలోని బాలికోన్నత పాఠశాలను రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక వసతులు, సదుపాయాల కల్పన సంస్థ చైర్మన్ యనమల నాగార్జున యాదవ్ బుధవారం సందర్శించారు. పాఠశాలలో అమలవుతున్న డిజిటల్ విద్యతో పాటు బాలికలకు సమకూరుస్తున్న మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూఐడీసీ డైరెక్టర్ బమ్మిడి లక్ష్మి, ఈఈ డీవీఎస్ మూర్తి, డీఈ వేణుగోపాల్, ఏఐ జాన్సన్, నెల్లిమర్ల ఎంఈవోలు సూర్యనారాయణమూర్తి, విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆశీలు వేలం ఖరారు

నెల్లిమర్ల: నగర పంచాయతీ రోడ్డు మార్జిన్ ఆశీలు వేలంపాటను కమిషనర్ పి.బాలాజీప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఈ పాటను జంగాల వీధికి చెందిన సలాది కాత్యాయని రూ.2లక్షల 29వేలకు ఖరారు చేసుకున్నారు. ఈ పాట సొమ్మును అదనంగా జీఎస్టీగా రూ.41,310, రిజిస్ట్రేషన్ ఫీజుగా రూ.6వేలను కాత్యాయని అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. గత ఏడాది పాట సొమ్ము కన్నా ఈ ఏడాది రూ.3,882 పెరిగినట్లు కమిషనర్ తెలిపారు. ఈ వేలంపాట కాలపరిమితి ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు అమలులో ఉంటుందని ఆయన చెప్పారు. ఈ వేలంపాట నిర్వహణలో కమిషనర్‌తో పాటు మేనేజర్ టీవీఎస్ పి.విశ్వేశ్వరరావు, ఆర్ఐ ఎ.రాజ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక దిగుబడులు సాధించేలా చూడాలి

● మంత్రి బొత్స సత్యనారాయణ

నెల్లిమర్ల: రైతులు అధిక దిగుబడులు సాధించేలా వారిలో అవగాహన కల్పించాలని రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటుచేసిన స్కూల్ ఆఫ్ స్మార్ట్ అగ్రికల్చర్, రైతు సమ్మేళనం కార్యక్రమాలను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మేలైన పంటల సాగుపై మెళకువలను నేర్పాలన్నారు. అనంతరం యూనివర్సిటీ ఎదుట ఏర్పాటుచేసిన ప్రయోగశాలలు, స్టాళ్లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, యూనివర్సిటీ చాన్సలర్ జీఎస్ఎన్ రాజు, వైస్ ప్రెసిడెంట్ డీఎన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ విజేతలకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న రవిశేఖర్

నెల్లిమర్ల: జాతీయ స్థాయిలో ఇటీవల జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించిన కొండవెలగాడ గ్రామానికి చెందిన శనతపతి పల్లవి, నీరజతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన కోచ్ చల్లా రామును స్థానిక టీడీపీ నాయకుడు సువ్వాడ రవిశేఖర్ అభినందించారు. వారు బుధవారం నెల్లిమర్లలో రవిశేఖర్ ఇంటికి వెళ్లి, మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి



ప్రకృతి సాగును పరిశీలిస్తున్న దేవుళ్లు

సీతంపేట: ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్టు స్టేట్ రిసోర్స్ పర్సన్ దేవుళ్లు స్పష్టం చేశారు. బుధవారం జక్కరవలసలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 13 మంది గిరిజన రైతులక లాభదాయక పంటలను గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కళ్యాణ పాత్రో, కో-ఆర్డినేటర్ రమణ, ఐటీడీఏ ఎస్ఎఫ్ఏ ముసలయ్య, బాలు, అంబోజీ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, విజయనగరం : 9985411533
పార్వతీపురం : 9985403035, సాలూరు : 9492900300



వైసీపీ పాలనకు మంగళం పాడుదాం

● టీడీపీ పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి విజయచంద్ర



పార్వతీపురం రూరల్: పెద్దబొండపల్లిలో పర్యటిస్తున్న విజయచంద్ర

పార్వతీపురం రూరల్: రానున్న ఎన్నికల్లో వైసీపీ పాలనకు మంగళం పాడేందుకు ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి బోనెల విజయచంద్ర కోరారు. బుధవారం పెద్దబొండపల్లిలో వివిధ సామాజిక వర్గాల పెద్దలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. టీడీపీ-జనసేనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బోను దేవి చంద్రమౌళి, నాయకులు చిన్న రామ్మూర్తినాయుడు, సవరపు గాంధీ, చుక్క అచ్యుత, గొట్టాపు వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

సీతానగరం: టీడీపీతోనే బీసీల అభివృద్ధి సాధ్యమని పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్ర అన్నారు. తుమరాడ గ్రామంలో టీడీపీ అధ్యక్షుడు పెంకి వేణుగోపాల్‌నాయుడు, బీసీ సెల్ అధ్యక్షుడు బూరాడ రామ్మోహన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్సీ జగదీష్ పాల్గొని, మాట్లాడారు. బీసీల అభివృద్ధే టీడీపీ ధ్యేయం అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా కలిసి పనిచేద్దాం



మాట్లాడుతున్న ఎంపీపీ సురేష్

జియ్యమ్మవలస: రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని తోయక జగదీశ్వరి గెలుపే లక్ష్యంగా మండలంలో కలిసి పనిచేద్దామని ఎంపీపీ బొంగు సురేష్.. టీడీపీ, జనసేన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం ఎం.అల్లువాడ గ్రామంలోని తన నివాసంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో టీడీపీ, జనసేన పార్టీలో ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికుడిలా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా మండలంలో 10 వేల ఓట్లు మెజార్టీ సాధించడమే మన లక్ష్యమన్నారు. అంతకు ముందు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని తోయక జగదీశ్వరికి అభినందనలు తెలిపారు. తర్వాత అరకు పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ మాట్లాడుతూ మండలంలో టీడీపీ క్యాడర్ బలంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పంచాయతీల టీడీపీ సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపటీసీ సభ్యులు, పార్టీ సీనియర్ నాయకులు, జనసేన నాయకులు రంజిత్‌కుమార్, వారణాశి శివకుమార్, జిల్లా జనసేన కార్యనిర్వహణ కార్యదర్శి శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బలహీన వర్గాల సంక్షేమం

● గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్



శ్రీనివాసరావుకు మద్దతు తెలుపుతున్న పెదమానాపురం నాయకులు

దత్తిరాజేరు: టీడీపీ తోనే బలహీన వర్గాల సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గుచ్చిమి గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలతో ప్రజల అభ్యున్నతికి అవకాశం ఉందన్నారు. వాటిని ఇంటింటికి వెళ్లి వివరించారు. పెదమానాపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ ఎస్.పైడిరాజు, గాడి అప్పలనాయుడు, గంట తులసి నాయుడు, ఆదినారాయణ, దుర్గారావు, పట్టాభి ప్రసాదరావు, పలువురు.. శ్రీనివాస్‌ను కార్యాలయం వద్ద కలిసి మద్దతు తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, బీసీ సాధికారిత జిల్లా పార్లమెంటరీ కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు, తెలుగు యువత ఉపాధ్యక్షుడు బాలి శంకరరావు, వార్డు మెంబర్లు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్'పై ప్రచారం



అవగాహన పరుస్తున్న టీడీపీ నాయకులు

కురుపాం: ఏగులవాడ పంచాయతీ పరిధిలో గిరిజన గ్రామాలైన ఇప్పలగుడ్డి, పోరండంగ్, బొత్తిలి, సెట్రగూడ, ఈతమానుగూడ తదితర గ్రామాల్లో బుధవారం టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా టీడీపీ మండల కన్వీనర్ కేవీ కొండయ్య ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్, టీడీపీ నాయకులు రంజిత్‌కుమార్ నాయక్, సుక్కు, భగవాన్, రాజు, తిరుపతి, బుద్దేసు, గౌరీశంకరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు నష్టం కలిగించొద్దు



కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

పార్వతీపురం టౌన్: భవన నిర్మాణ కార్మికులకు నష్టం చేకూర్చే మెమో నెం.1214 రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి జీవీ రమణ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా బుధవారం పట్టణంలోని పలు భవనాల నిర్మాణాల వద్దకు వెళ్లి కార్మికులతో మాట్లాడారు. రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్మికులకు తమ సంక్షేమ పథకాలు బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలు చేసే మెమో నెం.1214ను రద్దు చేయాలని కోరారు. బోర్డులో ఉన్న కార్మికులకు ఎటువంటి సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. నాలుగేళ్లుగా ప్రభుత్వం కార్మికులకు చెల్లించాల్సిన పరిహారాలు చెల్లించకపోవడం బాధాకరం అన్నారు. కరోనా కారణంగా చనిపోయిన భవన నిర్మాణ రంగ కార్మికులకు రూ.10లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని, ఈ ప్రభుత్వాన్ని కోరిన కనీస స్పందించలేదన్నారు. కార్మికుల సెస్ నిధులు రూ.2,450 కోట్లు సంక్షేమ బోర్డుకు ప్రభుత్వం అప్పగించాలని డిమాండ్ చేశారు. నిర్మాణ రంగానికి వాడే ఇనుము, సిమెంటు, ఇసుక ధరలను తగ్గించి కనీసం ఉపాధినైనా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

టీడీపీ, సీపీఎం ఆధ్వర్యంలో గోతులు పూడ్చివేత

కొమరాడ: మండల కేంద్రానికి సమీపంలో పార్వతీపురం నుంచి రాయగడ వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి పై ఏర్పడిన గోతులను టీడీపీ, సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో బుధవారం పూడ్చిపెట్టారు. లారీల తో క్రషర్ డస్ట్ తీసుకువచ్చి గోతుల్లో వేసి, పూడ్చి వేశారు. గత కొద్ది రోజులుగా గోతులను పూడ్చాలంటూ నిరసనలు, రాస్తారోకోలు చేపట్టారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదు. దీంతో టీడీపీ, సీపీఎం నాయకులు శ్రీనివాసరావు, కె.సాంబమూర్తి, సింహాచలం స్పందించి, రహదారిపై గోతులను పూడ్చి పెట్టారు. దీంతో వాహన చోదకులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

జియ్యమ్మవలస: రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు డాక్టర్ చీకటి శంకరరావు వైద్య సేవలు అందించారు. వసతి గృహాల్లో ఉన్న సుమారు 200 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మలేరియా, డెంగ్యూ, రక్తహీనత, తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.తిరుపతి, వార్డెన్ ఎం.రాజేంద్ర, ల్యాబ్ టెక్నీషియన్ ఆర్.సురేష్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం రుచిగా ఉండాలి

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులకు వండి పెడుతు న్న మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలని మండల విద్యాశాఖాధికారి చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ఇరిడి పాఠశా లను సందర్శించి భోజనాన్ని రుచి చూశారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. నాడు-నేడు పనులపై ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సిబ్బందిని ఆదేశించారు.

సంక్షేమ పథకాలు అందించండి

పాలకొండ: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను బిల్డింగ్ వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలు చేయాలని పాలకొండ మండల కార్యదర్శి ఆర్తమూడి లక్ష్మణరావు పేర్కొన్నారు. ఈ నెల 29న తలపెట్టిన నిరసన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలనుర బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అందించారని, వీటిని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ ప్రతినిధులు ఎస్.నారాయణరావు, జి.హేమసుందరరావు, పి.సంతు, ఎస్.రాంబాబు, సి.హెచ్.ఈశ్వరరావు, కె.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

గరుగుబిల్లి: ఉపాధి పనుల్లో నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని ఎంపీడీవో పైల సూర్యనారాయణ హెచ్చరించారు. బుధవారం మండల అభివృద్ధి కార్యాలయంలో క్షేత్ర సహాయకులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజుల పనిదినాలను విధిగా చేరుకోవాలన్నారు. రెండు పూటలా పనులు చేసేలా దృష్టి సారించాల న్నారు. ఎన్ఎంఎంఎస్ యాప్‌లో ఉదయం 8 గంటల్లోగా 80 శాతం హాజరు ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. 25 పంచాయతీల పరిధిలో 5,880 మంది హాజరు ఉండాలని స్పష్టం చేశారు. మార్చి నెలాఖరుకు వంద రోజులు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏపీవో ఎం.గౌరీనాథ్, ఈసీ డి.శ్రీనివాస రావు, టెక్నికల్ అసిస్టెంట్లు కె.నిర్మల, ఎం.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మస్తర్లలో వ్యత్యాసాలు ఉంటే చర్యలు

గరుగు బిల్లి: పనులు నిర్వహించే సమయంలో వేతనదారుల మస్తర్లలో వ్యత్యాసాలు ఉంటే చర్య లు తప్పవని మండల ఇన్‌చార్జి ఉపాధి ఇంజనీర్ డి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం గొట్టివలసలో పనులను ఆయన పరిశీ లించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేతనదారులు విధిగా జాబ్ కార్డులను తీసుకురావాలన్నారు. మస్తర్లలో మృతులు, చిన్నారుల వివరాలు ఉండకూడదన్నా రు. ఈ పరిశీలనలో క్షేత్ర సహాయకులు నల్ల సూర్యనారాయణ ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంవో

కొమరాడ: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా మలేరియా అధికారి (డీఎంవో) టి.జగన్మోహనరావు సూచించారు. బుధవారం కూనేరు రామభద్రపురం, కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీకి ఎటువంటి ఆరోగ్య సమస్యలతో వస్తున్నారు? అక్కడ అందిస్తున్న చికిత్సల వివరాలపై ఆరా తీశారు. సచివాలయాల పరిధిలో ఉన్న హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలలో వైద్య సేవలు అందేలా చూడాలని వైద్యాధికారులకు సూచించారు. ఆయన వెంట డాక్టర్ అరుణ్ కుమార్, ఏఎంవో సూర్యనారాయణ, వైద్య సిబ్బంది ఉన్నారు.

పశు సంవర్ధక శాఖ పథకాలపై సమీక్ష

గరుగుబిల్లి: పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై మండల కేంద్రంలోని ఏరియా పశు వైద్యశాలలో బుధవారం ఆయా గ్రామాల పశు సంవర్ధక శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గరుగుబిల్లి ఏరియా పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ బి.గణపతి రావు మాట్లాడుతూ గ్రామాల్లో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలను నిర్దేశించిన సమయంలోగా రైతులకు అందజేయాల్సి ఉందన్నారు. మండల పశు సంవర్ధక శాఖ అధికారి ఎస్.సురేష్‌కుమార్ మాట్లాడుతూ పశువుల కు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయాల్సి ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో పశు వైద్య సిబ్బంది మంత్ర బుడ్డి శ్రీరాములునాయుడు, ఎ.వెంకటి, తదితరులు పాల్గొన్నారు.

ఎనీ టైం పని చేయని ఏటీఎం

● తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఖాతాదారులు

గజపతినగరం: పేరుకే ఏటీఎంలు.. ఎక్కడా ఏ ఏటీఎంల్లో చూసినా నగదు ఉండడం లేదు. దీంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత పది రోజులుగా ఏటీఎంల్లో సక్రమంగా నగదు నిర్వహణ జరగకపోవడంతో ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గజపతినగరం నియోజకవర్గ, మండల కేంద్రంలో సుమారు పది ప్రభుత్వ ప్రైవేటు వాణిజ్య బ్యాంకులు ఉన్నాయి. వాటికి సంబంధించిన ఏటీఎంలు ఉన్నాయి. అయినా ఖాతాదారులకు మాత్రం వినియోగంలోకి రాని పరిస్థితి ఉంది. బ్యాంకులకు వెళ్లి నగదు విత్‌డ్రా చేసుకుందామంటే ఉదయం 10 నుంచి 2 గంటల వరకు ప్రతిరోజూ రద్దీగా ఉంటుంది. నియోజకవర్గం పరిధిలోగల గజపతినగరం, బొండపల్లి, దత్తిరాజేరు మండలాలతో పాటు మెంటాడ మండల వాసులు నగదు అవసరార్థం గజపతినగం పట్టణంలోగల ఏటీఎంలనే ఆశ్రయించాల్సి ఉంది. ఒకటోవ తేదీ నుంచి పింఛన్లు, ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, వ్యాపారస్తుల లావాదేవీల తోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, బీమా సౌకర్యాలతో నిత్యం బ్యాంకులు రద్దీగా ఉంటున్నాయి. దీంతో ప్రతిరోజు బ్యాంకుల వద్ద ఖాతాదారులు బారులు తీరాల్సిందే. ఏటీఎంలు సహకరిస్తే తమకు ఇబ్బందులు ఉండేవి కాదని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగుచర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ఖాతాదారులు కోరుతున్నారు.

సాలూరు పట్టణ సీఐగా వాసునాయుడు

సాలూరు రూరల్: సాలూరు పట్టణ సీఐగా చింత వాసునాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ సీఐగా పనిచేసిన జి.దేవుడు బాబు పార్వతీపురం డీసీఆర్‌బీకి బదిలీ అయ్యారు. పార్వతీపురం డీసీఆర్‌బీలో పనిచేస్తున్న చింత వాసునాయుడు సాలూరు పట్టణ సీఐగా వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు పట్టణ ఎస్ఐ సీతారామ్, ఏఎస్ఐ వలీ స్వాగతించారు.

IDBI BANK LTD
రిటైల్ అసెట్స్ సెంటర్
సిరిపురం, విశాఖపట్నం-530003
స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం ప్రకటన

పట్టిక IV-A (నియమావళి రూలు 8(6) చూడండి)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 లోని రూలు 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.
సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన ఐడిబిఐ బ్యాంక్ ఈ దిగువ తెలిపిన ఋణగ్రహీతలు, తనఖాదారులు మరియు హామీదారులు చెల్లించబడిన బకాయి మొత్తమును వసూలు చేయుట కొరకు ఐడిబిఐ బ్యాంక్ అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/ భౌతికంగా స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన/ అధీనంలో ఉన్న దిగువ వివరించిన స్థిరాస్తులను "ఎక్కడ ఏలా ఉన్నది అలానే" మరియు "ఎట్టి పునర్విమర్శనకు మరియు ఫిర్యాదు లేని" అనే ప్రాతిపదికన విక్రయించబడునని సాధారణ ప్రజానీకానికి ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)లకు ఈ నోటీసు ఇవ్వడమైనది. రిజర్వు ధర మరియు ధరావత్తు వివరములు క్రింద తెలుపబడినవి. ఇ-వేలం ప్లాట్‌ఫామ్ ద్వారా వెబ్‌సైట్ : www.bankeauctionwizard.com నందు అమ్మకం జరుగును.

1) ఋణగ్రహీత(లు) పేర్లు : 1) ఋణగ్రహీత(ల) పేర్లు: శ్రీ వెంకటరావు రెడ్డిపల్లి, # 2-70, మింధి గ్రామం, బి.హెచ్.పి.వి.పోస్ట్, గాజువాక, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-530012. వేరొక ఇరునామా: హిందుస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, గాంధీగ్రామ్ పోస్ట్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-530005, వేరొక చిరునామా: మొదటి అంతస్తు, ఫ్లాట్ నెం.17, హిందూజ నగర్, సర్వే నెం. 19/2, అప్పికొండ గ్రామ పంచాయితీ, పెదగంట్యాడ మండలం, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-530005, 2) శ్రీమతి వరలక్ష్మి రెడ్డిపల్లి, # 2-70, మింధి గ్రామం, బి.హెచ్.పి.వి.పోస్ట్, గాజువాక, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-530012. 3) శ్రీ కంబాల గంగాధరరావు, ఐయంపి నెం.72-4-ఎ632, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్, సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్, హిందుస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, గాంధీగ్రామ్ పోస్ట్, విశాఖపట్నం, వేరొక చిరునామా: క్యు నెం. 707 ఎ, సింధియా న్యూ కాలనీ, గాంధీగ్రామ్ పోస్ట్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-530005 (అకౌంట్ నెం. 816675100005838). డిమాండ్ నోటీసు తేది: 22-12-2007, స్వాధీనత తేది: 03-03-2009, బకాయి మొత్తం: తేది 22-12-2007 నాటికి రూ. 6,14,547/- (అక్షరాల ఆరు లక్షల పద్నాలుగు వేల ఐదు వందల నలభై ఏడు రూపాయలు మాత్రమే) + తేది: 23-12-2007 నుండి వడ్డీ ప్లస్ ఇతర ఖర్చులు మరియు ఛార్జీలు మొ॥వి. (ఋణగ్రహీతల/తనఖాదారులు/హామీదారులు ఏవైన చెల్లింపులు చేసినచో తీసివేయబడును). ఆస్తి వివరములు : విశాఖపట్నం జిల్లా, గాజువాక సబ్ రిజిస్ట్రేషన్, అప్పికొండ గ్రామ పరిధి, అప్పికొండ పంచాయితీ, హిందూజ నగర్, సర్వే నెం. 19/2లోని ఫ్లాట్ నెం.17తో గల మొత్తం 166.60 చ॥గ॥లు లేదా 139.349 చ॥మీ॥ల విస్తీర్ణంలో 83.3 చ॥గ॥లు లేదా 69.649 చ॥మీ॥ల అవిభాజ్యపు మరియు అనిర్దేశపు వాటాతో గల స్థలం వెంకటరావు రెడ్డిపల్లి గారికి చెందినది. (రిజిస్టర్డ్ డాక్యుమెంట్ నెం. 3150/2006 ప్రకారం) మొత్తం ఆస్తినకు హద్దులు: తూర్పు: ఫ్లాట్ నెం.16, దక్షిణం: 30 అ॥ల వెడల్పు రోడ్డు, పడమర: ఫ్లాట్ నెం.18, ఉత్తరం: ఇసారపు కుమారి మరియు ఇతరులకు చెందిన భూమి. కొలతలు: తూర్పు: 30' అ॥లు లేదా 9.14 మీ॥లు, దక్షిణం: 50' అ॥లు లేదా 15.24 మీ॥లు, పడమర: 39' అ॥లు లేదా 9.14 మీ॥లు, ఉత్తరం: 50' అ॥లు లేదా 15.24 మీ॥లు.

రిజర్వు ధర : రూ.8,05,495/- ధరావత్తు : రూ.80,549/- బిడ్ పెంపుదల మొత్తం : రూ.10,000/-
ఇ-వేలం తేది మరియు సమయం : 20-03-2024, ఉ॥11.00 గం॥ల నుండి మ॥12.00 గం॥ల వరకు
బిడ్లు సమర్పించుటకు ఆఖరు తేది మరియు సమయం : 19-03-2024, సాయంత్రం 04.00 గం॥ల వరకు

2) ఋణగ్రహీత(లు) పేర్లు : 1) మెస్సర్స్ యస్‌పి ట్రేడర్స్, # 6-20-20/3, ఈస్ట్ పాయింట్ కాలనీ, లాసన్స్‌బే కాలనీ, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-530017, 2) మెస్సర్స్ యస్‌పి ట్రేడర్స్, # 6-15-33/ఎ, చినవాల్తేరు, ఈస్ట్ పాయింట్ కాలనీ, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-530017, 3) శ్రీ యామికె విజయరామ శరత్‌వర్మ, తండ్రి: వైవి ప్రసాద్, 10-04-1/5బి, సత్తయ్యపేట, విజయనగరం, ఆంధ్రప్రదేశ్-535002. 4) శ్రీ యామికె విజయరామ శరత్ వర్మ, # 6-20-20/3, ఈస్ట్‌పాయింట్ కాలనీ, లాసన్స్ బే, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-533017. (అకౌంట్ నెం. 0031651100000949; 003167320000277; 00316722000029). డిమాండ్ నోటీసు తేది: 07-07-2022, స్వాధీనత తేది: 27-09-2022, బకాయి మొత్తం: తేది. 31-05-2022 నాటికి రూ. 21,32,876.07 (అక్షరాల ఇరవై ఒక్క లక్షల ముప్పైరెండు వేల ఎనిమిదివందల డెబ్బై ఆరు రూపాయలు మరియు ఏడు పైసలు మాత్రమే) + తేది: 31-05-2022 నుండి వర్తించు వడ్డీ ప్లస్ ఇతర ఖర్చులు మరియు ఛార్జీలు మొ॥వి (ఋణగ్రహీతలు/తనఖాదారులు/హామీదారులు ఏవైన చెల్లింపులు చేసినచో తీసివేయబడును. ఆస్తి వివరములు: విజయనగరం జిల్లా, విజయనగరం యస్‌ఆర్‌ఓ, విజయనగరం మునిసిపాలిటీ, వంటిటాడి అంగ్రహారం గ్రామము, యస్.నెం.115/7 నందు 244 చ॥గ॥లు స్థలము యామికె విజయరామ శరత్ శర్మ గారికి చెందినది (రిజిస్టర్డ్ డాక్యుమెంట్ నెం. 522/2018 ప్రకారం), హద్దులు: తూర్పు: ఎగిక్యూటెంట్ యొక్క మిగిలిన ఖాళీస్థలము, పడమర: శ్రీనాథ విజయలక్ష్మి యొక్క ఆస్తి, ఉత్తరం: ఉమ్మడి దారి, దక్షిణం: చెరువు.

రిజర్వు ధర : రూ.27,81,600/- ధరావత్తు : రూ.2,76,160/- బిడ్ పెంపుదల మొత్తం : రూ.10,000/-
ఇ-వేలం తేది మరియు సమయం : 20-03-2024, ఉ॥గం॥11.30 ని॥ల నుండి మ॥గం॥12.30 ని॥ల వరకు
బిడ్లు సమర్పించుటకు ఆఖరు తేది మరియు సమయం : 19-03-2024, సాయంత్రం 04.00 గం॥ల వరకు

వేలం యొక్క నియమ నిబంధనలు: (1) వేలంను బ్యాంకు వారి అనుమతి పొందిన సర్వీసు ప్రొవైడర్ M/s ANTARES SYSTEMS LIMITED, వారి వెబ్ పోర్టల్ https:www.bankeauctionwizard.com ద్వారా జరుపబడును. ఆన్‌లైన్ ఇవేలం బిడ్ ఫారం, డిక్లరేషన్, ఆన్‌లైన్ వేలం అమ్మకం యొక్క సాధారణ నియమ నిబంధనలతో ఇ-వేలం టెండరు పత్రము వెబ్‌సైట్ www.bankeauctionwizard.com లో లభించును. లేదా ఏదైనా ఇతర సహాయం కొరకు ఇ-మెయిల్ చిరునామా: nirmala.yeleti@idbi.co.in, chintada.rao@idbi.co.in, sushmitha.b@antaressystems.com/marina.j@antaressystems.com మరియు ఫోన్: 080-45982100, 8951944383 / 9686196751, www.bankeauctionwizard.com, M/s ANTARES SYSTEMS LIMITED, # 137/3, హగ్గేను, కంగేరి, బెంగుళూరు మైసూర్ రోడ్, కెయమ్‌యస్ కోచ్ బిల్డర్స్ ఎదురు, బెంగుళూరు-560060 వారి ని సంప్రదించవలెను. (2) అనుమతి గల యూజర్ ఐడి / పాస్‌వర్డ్ & డిడి/పే ఆర్డర్ ఐడిబిఐ బ్యాంకు లిమిటెడ్ పేరున విశాఖపట్నంలో చెల్లుబాటు అయ్యేటట్లుగా లేదా RTGS లేదా ఐడిబిఐ బ్యాంకు లిమిటెడ్, రిటైల్ అసెట్ సెంటర్, విశాఖపట్నం వారి అకౌంట్ నెం. 03137000010793, IFSC Code: IBKL0000031 ద్వారా చెల్లించిన ఋజువు గల బిడ్డరు మాత్రమే ఇ-వేలంలో పాల్గొనుటకు అర్హులు. (3) విజేత బిడ్డరు ధరావత్తు సొమ్ము (ఇఎమ్‌డి) సొమ్మును అమ్మకం విలువలో భాగంగా ఉంచెదరు. విజేత కాని బిడ్డరుకు ధరావత్తు సొమ్ము తిరిగి చెల్లించెదరు. సదరు ధరావత్తు పై ఏవిధమైన వడ్డీ చెల్లించబడదు. అధీకృత అధికారి గారు బిడ్ ధర అనుమతించిన వెంటనే, విజేత అయిన బిడ్డరు వేలం పూర్తి అయిన రోజున, ధరావత్తు సరిచూచుకొని అమ్మకం ధరకు 25% విలువ అగునట్లు సొమ్ము చెల్లించవలెను. మిగిలిన 75% సొమ్మును అధీకృత అధికారి గారు వ్రాతపూర్వకంగా అనుమతించిన తేదీలోగా లేదా అమ్మకం తేదీ నుండి 15 రోజులలోగా పూర్తిగా చెల్లించవలెను. లేనిచో ధరావత్తు & అప్పటివరకు చెల్లించిన సొమ్ములు ఈయబడదు. దీనికి ఏవిధమైన ముందస్తు నోటీసు ఇవ్వబడదు. ఒకవేళ అమ్మకం నియమ నిబంధనలు అనుసరించుటలో విఫలమైన లేదా ఏదైనా తప్పుచేసినా, సదరు విఫలత చెందిన బిడ్డరుకు సదరు ఆస్తి పై గాని లేదా తదుపరి దానిని అమ్మగా వచ్చు సొమ్ములో భాగంపై గాని హక్కు లేదు. (4) విక్రయం బ్యాంకు ధృవీకరణకు లోబడి ఉంటుంది. (5) మొత్తం వేలం అమ్మకం సొమ్మును విజేత బిడ్డరు ద్వారా రాబట్టిన వెంటనే అధృకృత అధికారి గారు సదరు చట్టంలోని నియమముల ప్రకారం అమ్మకపు నిర్ధారణ పత్రమును జారీచేసెదరు. సదరు అమ్మకం నిర్ధారణ పత్రము జారీచేసిన వెంటనే అమ్మకం పూర్తియగును. అమ్మకం నిర్ధారణ పత్రము రిజిస్ట్రేషన్ గురించి అధీకృత అధికారి గారి ఏ బాధ్యత లేదు. అమ్మకపు ధృవపత్రం రిజిస్ట్రేషన్ చేసుకొను బాధ్యత బిడ్డరు పై ఉన్నది. ఇది అతడు/ ఆమె ఇష్టం పై ఆధారపడి ఉన్నది. (6) విజేత అయిన బిడ్డరు, స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, అయిన ఖర్చులు మొ॥ అన్ని అమ్మకపు ధృవపత్రం రిజిస్ట్రేషన్ కొరకు భరించవలెను. ఇది అతడు / ఆమె ఇష్టంపై ఆధారపడి ఉన్నది. విజేత బిడ్డరు, స్టాట్యూటరీ బకాయిలు/టాక్సులు/ఛార్జీలు/ఫీజులు కూడా చట్ట ప్రకారం మరియు ఇన్‌కంట్యాక్స్ చట్టాల ప్రకారం చెల్లించవలెను మరియు విద్యుత్ ఛార్జీలు, నీటి ఛార్జీలు, నిర్వాహణ ఛార్జీలు (ఖర్చులు) మరియు ఇతర సేవల ఖర్చులు కూడా భరించవలెను. సదరు ఆస్తుల గురించి మరియు చెల్లించవలసిన స్టాట్యూటరీ బకాయిలు / ట్యాక్సులు, ఫీజు, విద్యుత్ ఛార్జీలు నిర్వహణ ఖర్చులు మొదలైనవి పై ఆస్తికి సంబంధించిన అన్నింటి గురించి ముందుగానే విచారణ చేసుకోవలెను. (7) అధీకృత అధికారి గారికి ఏదైన టెండరు లేదా బిడ్, ఏదైనా అన్ని ఆఫర్లు అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు మరియు ఏ కారణం తెలుపకుండా వేలం రద్దు చేయుటకు లేదా వేలం ఆపుటకు లేదా వాయిదా వేయుటకు మరియు అమ్మకం నియమ నిబంధనలు మార్పు చేయుటకు మొ॥ అన్నిటిపై పూర్తి అధికారం కలదు. (8) సెక్యూర్డు క్రెడిటార్ ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్ "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అది అలానే" మరియు "ఎట్టి పునర్విమర్శనకు మరియు ఫిర్యాదులేని" ప్రాతిపదికన పైన తెలిపిన ఆస్తులు విక్రయించబడతాయి. (9) ఔత్సాహిక బిడ్డర్లు స్వయంగా ఆస్తి ఎన్‌కంబరెన్సులు మరియు టైటిల్ గురించి పరీక్షించుకొనుటకు / విచారించుకొనుటకు / తెలుసుకొనుటకు పూర్తి స్వతంత్ర్యం కలదు. బిడ్డు సమర్పించిన బిడ్డరుకు సదరు ఆస్తి స్థితిగతులు, తగిన పత్రములు, సమాచారం మొదలగు వాటి గురించి పూర్తిగా తెలియునని భావించబడును. బిడ్డరు ఆస్తిని దాని పరిసరాలు మొ॥ అన్ని బిడ్ సమర్పణకు ముందుగా పరీక్షించుకుని తృప్తి చెందినట్లుగా నిర్ధయించబడును. కావున బిడ్ సమర్పించే ముందు ఆస్తిని పరిసరాలను, అన్ని పత్రములను, స్వంత ఖర్చులతో స్వయంగా పరీక్షించుకొని బిడ్డర్లు వేలం బిడ్ సమర్పించి వేలం నందు పాల్గొనవలెను. బిడ్డరు అతడు / ఆమె ఆస్తుల పత్రములు, పేర్లు, వివరములు, పరిమాణం, లక్షణాల అమ్మకం కొరకు సమర్పించిన ఆఫరు స్వీకరించిన లేదా / అంగీకరించినచో అది బదిలీ చేయుటకు వీలు లేదు. (10) ఆఫర్ అమ్మకానికి స్వీకరించబడినది లేదా ఆమోదించబడినది లేదా బదిలీచేయబడదు. (11) ఈ విషయానికి చెందిన ఏవైనా వివాదాలు విశాఖపట్నంలోని న్యాయస్థానాల పరిధిలోకి మాత్రమే వస్తాయి. (12) పైన తెలిపిన ఋణగ్రహీతలు / హామీదారులు / తనఖాదారులకు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002లోని రూలు 9(1) ప్రకారం ఈ పత్రికా ప్రకటన "15 రోజుల నోటీసు"గా ఇందుమూలముగా ప్రచురించడమైనది మరియు జారీచేయబడినది. (13) ఐడిబిఐ బ్యాంకు లిమిటెడ్, రిటైల్ అసెట్స్ సెంటర్, విఐపి రోడ్డు, విశాఖపట్నం, ఫోన్: 0891-2871940 / 41 / 49 వారికి ముందుగా తెలిపి తేది.14-03-2024 (గురువారం), ఉదయం 11.00 గం॥ల నుండి మధ్యాహ్నం 3.00 గం॥ల వరకు ఆస్తులను తనిఖీ చేసుకొనవచ్చును.

తేది : 28-02-2024, ప్రదేశం : విశాఖపట్నం
అధీకృత అధికారి, ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్.